

నిలబడతారా..? తడబడతారా..?

- ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ మార్పుపై వైసిపి పునరాలోచన - అధిష్టాన పెద్దలతో ఎర్రకోట మంతనాలు

వైసిపి ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ విషయంలో మార్పులు చోటు చేసుకోనున్నాయా..?, ప్రస్తుత ఇన్‌ఛార్జీ మాచాని వెంకటేష్‌ను తప్పించే యోచనలో అధిష్టానం ఉందా..?, సర్వేల ఆధారంగా సిట్టింగ్ ఎమ్మెల్యే తనయుడు జగన్మోహన్‌రెడ్డికి టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం సుముఖంగా ఉందా..?, ఈ విషయంపై సిట్టింగ్ ఎమ్మెల్యే అధిష్టాన పెద్దలతో మంతనాలు చేస్తున్నారా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇన్‌ఛార్జీని ప్రకటించి 20 రోజులు గడవక ముందే ఇన్‌ఛార్జీ మార్పుపై అధిష్టానం పునరాలోచనలో పడింది. టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి బరిలో ఉండడంతో బలమైన నాయకుని దించేందుకు వైసిపి కసరత్తు చేస్తోంది...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు పార్లమెంట్ పరిధిలో చేనేతపురిగా పేరుగాంచిన ఎమ్మిగనూరు సెగ్మెంట్ వైసిపి రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి వయోభారం నేపథ్యంలో ఈసారి తాను ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. తనకు బదులు తన కుమారుడు జగన్మోహన్ రెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలు ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపుతాయనే ఉద్దేశంతో వైసిపి అధినేత రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల మార్పు, చేర్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈ నెల 2న ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా చేనేత కుటుంబానికి చెందిన మాచాని వెంకటేష్‌ను నియమించి అధికారిక ప్రకటన చేసింది. ఈ సీటు కోసం మాజీ ఎంపీ బుట్టా రేణుక, సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిలు పోటీ పడ్డారు. కానీ నియోజకవర్గంపై ఎవరూ కూడా పెత్తనం చెలాయించకూడదనే ఉద్దేశంతో ఎర్రకోట తనకు టికెట్ ఇవ్వకుంటే తాను చెప్పిన వారికి ఇవ్వాలని పట్టుబట్టి మరీ చేనేత కుటుంబానికి చెందిన మాచాని వెంకటేష్‌ను ఇన్‌ఛార్జీగా నియమించుకుని పంతం నెగ్గించుకున్నారు. కానీ సిట్టింగ్ ఎమ్మెల్యేకు మొండిచేయి చూపడం పట్ల ఆయన అనుచరులు భారీ ఎత్తున నిరసనలు తెలిపారు. కొత్తవారికి టికెట్ ఇస్తే తాము సహకరించబోమని తేల్చి చెప్పారు. దీంతో డైలామాలో పడిన వైసిపి అధిష్టానం పునరాలోచనలో పడింది. సర్వే నివేదికల ఆధారంగా మాచానికి బదులు సిట్టింగ్ ఎమ్మెల్యే తనయుడు జగన్మోహన్ రెడ్డికి టికెట్ ఇచ్చే యోచనలో పడింది. ఈ విషయంపై ఎమ్మెల్యే ఎర్రకోట వైసిపి పెద్దలతో మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల్లో ఇన్‌ఛార్జీ పేరును ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

సీటు ఇప్పించి.. ఆపై తొలగించి..?

ఎమ్మిగనూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి రాజకీయ చదరంగం ఆడారనే విమర్శలతో కూడిన ఆరోపణలున్నాయి. రానున్న



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి అభ్యర్థుల మార్పులు, చేర్పులు చేపట్టారు. అందులో భాగంగా ప్రయివేట్ సంస్థలతో పాటు ఐ ప్యాక్, తన సొంత సంస్థలతో అన్ని నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానాలపై సర్వే చేయించారు. ఈ సర్వే నివేదికలు నేతల ముందు పెట్టి ఇతరులకు సీటు కేటాయిస్తున్నామని, వారికి సహకరించాలని అధిష్టానం పెద్దలు బుజ్జగింపులు చేశారు. అదే తరహాలో ఎమ్మిగనూరు విషయంలో కూడా జరిగింది. గంపెడాశలతో తాడేపల్లి సిఎంఒ కార్యాలయానికి చేరిన ఎమ్మెల్యే ఎర్రకోట తన కుమారునికి సీటు ఇవ్వాలని కోరారు. కానీ అధిష్టాన పెద్దలు నచ్చజెప్పినా ముఖ్యమంత్రితోనే తేల్చుకుంటామంటూ జగన్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత తన కుమారునికి సీటు ఇవ్వకుంటే తాను చెప్పిన వారికి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టడంతో మాచాని వెంకటేష్‌ను ఇన్‌ఛార్జీగా రెండో జాబితాలో ప్రకటించారు అధిష్టాన పెద్దలు. చాలా మంది ఎమ్మెల్యే తన పంతం నెగ్గించుకున్నారని కాస్త సానుభూతి చూపారు. కానీ వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే అవకాశం దొరికినప్పుడల్లా ఇన్‌ఛార్జీని మార్చేయాలనే యోచనలో ఉన్న ఎమ్మెల్యే అనుకున్నట్లు చేసి ఇన్‌ఛార్జీ మార్పునకు పరోక్షంగా కారకుడయ్యారనే విమర్శలున్నాయి. అందుకే అధిష్టాన పెద్దలతో మంతనాలు చేసినట్లు సమాచారం. సీటు ఇప్పించినట్లే ఇప్పించి ఆపై తొలగించే కుట్రలు కూడా చేశారని నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు, చేనేతలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ, నాయకులు

రైతులకు న్యాయమైన పరిహారమివ్వాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పంట పొలాల్లో గ్రీన్‌కో కంపెనీ వారు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల వల్ల నష్టపోతున్న రైతులకు న్యాయమైన పరిహారమివ్వాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు, వెల్దుర్తి మండలాల్లోని ఎర్రకత్వ, పుల్లగుమ్మి, అల్లుగుండు తదితర గ్రామాల్లో గ్రీన్‌కో కంపెనీ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న పంట పొలాలను పరిశీలించారు. ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు మండల నాయకులు కె.మధు, నష్టపోయిన రైతులతో కలిసి ప్రభాకర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. గ్రీన్ కో కంపెనీ వారు పలుకుబడిని ఉపయోగించి రైతుల పంట పొలాల్లో రైతుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నష్టపోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వకుండా ఒక్కొక్కరికి ఒక్కో రకమైన పరిహారం ఇవ్వడం ఏమిటని మండిపడ్డారు. ఒక్కసారి విద్యుతత్ స్తంభం వేయడంతో ఆ భూమి శాశ్వతంగా విలువ కోల్పోయి రైతు నష్టపోతున్నారని తెలిపారు. అలాంటి రైతులను పూర్తిగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రీన్ కో కంపెనీ లాభాల కోసం రైతులను నిలువునా ముంచడం సరైన పద్ధతి కాదని, దీనిపై కలెక్టర్ కూడా వెంటనే జోక్యం చేసుకుని రైతుల పంట పొలాల్లో వేస్తున్న విద్యుత్ స్తంభాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు శివశంకర్, మధు, మద్దిలేటి, గోపి నాయక్, సొమ్లానాయక్, వెంకట్ రాముడు పాల్గొన్నారు.

'గణతంత్ర' వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామని ఎస్పీ జి.కృష్ణ కాంత్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో పోలీసులు నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి పరేడ్ రిహార్సల్స్‌లో గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకం ఆవిష్కరణ, పరేడ్ రిహార్సల్స్, అతిథుల గ్యాలరీలు, స్టాల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతున్నందున అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని, ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై పోలీసు అధికారులకు పలు సూచలను చేశారు. అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, ఎఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాష, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సివిల్, ఎఆర్, ట్రాఫిక్ పోలీసులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

సమాజ శ్రేయస్సు కోసం

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన - ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

సమాజ శ్రేయస్సు కోసం ఓటర్లు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. గురువారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందు జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఓటు హక్కును బాధ్యతగా అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. హక్కుల కోసం పోరాడే అవకాశం, జరిగిన తప్పులను నిలదీసే హక్కు ఉంటుందని తెలిపారు. గత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

ఎన్నికల్లో మొత్తం జిల్లాలో 76 శాతం ఓటింగ్ జరిగితే, కర్నూలు నగరంలో కేవలం 56 శాతం మాత్రం ఓటింగ్ శాతం నమోదయిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల కంటే ఎక్కువ శాతం పట్టణ ప్రాంతాల్లో సౌకర్యాలను, ఎక్కువ సర్వీసులు పొందుతూ ఓటు హక్కును వినియోగించుకోకపోవడం ఉండకూడదని తెలిపారు. గత ఎన్నికల్లో 'నో ఓటర్ లెఫ్ట్ బిహైండ్' అని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈఏడాది ఎన్నికల కమిషన్ 'Nothing like Voting, I Vote for Sure' అనే నినాదంతో అందరికీ ఓటు హక్కు కల్పించినట్లు తెలిపారు. ఐదేళ్లకోసారి వచ్చే బాధ్యతను అందరం గుర్తుంచుకొని భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసుకోవాలన్నారు. ఇప్పటికీ ఇంకా ఎవరైనా ఓటు హక్కు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై అభ్యర్థులు ఖరారయ్యే లోపు ఓటు హక్కు నమోదు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అయితే ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఓటర్లపై ఉంటుందన్నారు. ఎన్నికల రోజున సెలవు ఇచ్చారని ఇంటి దగ్గర ఉండకుండా ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ఇచ్చిన సెలవు అని గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈసారి ఎన్నికల్లో 85 శాతానికి పైగా ఓటింగ్ నమోదయ్యేలా అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడారు. ప్రతి ఓటరు ఓటు వేసి కుటుంబ సభ్యులతో కూడా ఓటు వేయించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఓటర్ జాబితాను శుద్ధి చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో వినియోగించే ఇవిఎం యంత్రాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాక్ పోల్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇవిఎం యంత్రాలపై ఎలాంటి అపోహలూ లేకుండా ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా యువ ఓటర్లు ఓటు హక్కుపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బిఎల్ఒలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పిడబ్ల్యుడి, సీనియర్ సిటిజన్ ఓటర్లను కలెక్టర్, జెసిలు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. డిఆర్ఒ కె.మధుసూదన్ రావు, నోడల్ ఆఫీసర్ (ఎస్సీ కార్పొరేషన్ ఇడి) శ్రీనివాస్ కుమార్, సెట్కూరు సిఇఒ రమణ, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

కర్నూలు కలెక్టరేట్ : 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ డాక్టర్ జి.సృజన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేటి యువత ఓటు హక్కు గురించి చుట్టూ ఉన్న సమాజానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యవంతులను చేయాలన్నారు. అలాగే ప్రతి ఓటరూ తమ ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే భవిష్యత్తుకు మంచి మార్గం వేసుకున్న వారం అవుతామన్నారు. డిఆర్ఒ కె.మధుసూదన రావు, నోడల్ ఆఫీసర్ (ఎస్సీ కార్పొరేషన్ ఇడి) శ్రీనివాస్ కుమార్, సెట్కూరు సిఇఒ రమణ, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


సూదేపల్లెలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి మండలం సూదేపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మండల కన్వీనర్ రవి రెడ్డి, జడ్పిటిసి సుంకన్న, సూదేపల్లె నాయకులు, దళిత సంఘాల నేతలతో కలసి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పెరాలసిస్‌తో ఇబ్బంది పడుతున్న సూదేపల్లి ఎంపీటీసీ పెద్ద రంగస్వామిని, గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్త గొల్ల మద్దినేశ్వరయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు.

టిడిపితోనే మహిళల సంక్షేమం, అభివృద్ధి

కర్నూలు ఇన్‌చార్జి టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మహిళలకు సంక్షేమం, అభివృద్ధి ఉంటాయని కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. గురువారం నగరంలోని 22వ వార్డు అరోరా నగర్‌కు చెందిన మహిళలు మౌర్య ఇన్‌లో టిజి భరత్ సమక్షంలో టిడిపిలో చేరారు. టిజి భరత్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రోజురోజుకూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ 1500 అందించడంతో పాటు ఎన్నో మంచి పథకాలు టిడిపి మేనిఫెస్టోలో పెట్టినట్లు చెప్పారు. కర్నూల్లో తనను గెలిపిస్తే ప్రజలకు మెరుగైన పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో భవానీ, శారద, సుధ, లక్ష్మీదేవి, ఎంజెలి, ఇందిర, మధులత, కావేరి, సుబ్బమ్మ, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు నేతలు శ్రీధర్, విష్ణు, వంశీ, వనిత, దీపిక, చైతన్య పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన మహిళలతో టీజీ భరత్

47 మంది ఎస్ఐలకు సిఐలుగా ప్రమోషన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాయలసీమ రేంజ్‌లోని 47 మంది ఎస్ఐలకు సిఐలుగా ప్రమోషన్ కల్పిస్తూ కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్లు పొందిన సిఐలు గురువారం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో డిఐజి ఎస్.సెంథిల్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాలకు భరోసాగా నిలుస్తూ పారదర్శకత, జవాబుదారీతనం, సత్వర స్పందన, బాధ్యతాయుతమైన సేవలే పరమావధిగా, రాబోయే ఎన్నికలలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. రాయలసీమ రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతరపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ఎస్సైలు, వివిధ లూప్ లైన్ (విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, ఎసిబి, టిటిడి, సిఐడి, రైల్వే, ఎస్ఐబి, ఎపి ట్రాన్స్ కో, పిటిసి)లలో పని చేస్తున్న ఎస్సైలు సిఐలుగా ప్రమోషన్ పొందారు. ఇందులో 2009 బ్యాచ్‌కు చెందిన వారు ఎక్కువ శాతం ఉన్నారు.



కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన సిఐలు

క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె విరమణ

- చర్చలు సఫలం - ఒక నెల జీతం రూ.12 వేలు అందజేత

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్.

క్లాప్ ఆటో డ్రైవర్లు తమ జీతాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత 39 రోజులుగా చేపడుతున్న సమ్మె గురువార విరమించారు. మాజీ కార్పొరేటర్ పి.నిర్మల ఆధ్వర్యంలో కమిషనర్ ఎ.భార్గవ్ తేజతో బుధవారం చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో గురువారం క్లాప్ ఆటో డ్రైవర్లకు ఒక నెల జీతం రూ.12 వేలు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె .విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఒక నెల జీతాలు, ఈ నెలాఖరు లోపల రెండు నెలల జీతాలు, ఫిబ్రవరి నెలలో మూడు నెలల జీతాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఎక్కువ పెండింగ్ ఉన్న వారి జీతాలు కూడా తదుపరి చెల్లిస్తామన్నారు. శుక్రవారం నుండి క్లాప్ ఆటో డ్రైవర్లు విధుల్లోకి వెళుతున్నట్లు ప్రకటించారు.



క్లాప్ ఆటో డ్రైవర్లకు ఒక నెల జీతం అందజేస్తున్న ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె విశ్వేశ్వర్ రెడ్డి

దోమల భారీ నుండి ప్రజలను కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో గత కొద్ది రోజులుగా దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై దాడి చేస్తున్నాయని, దోమల నివారణ చేపట్టాలని సిపిఎం నాయకులు అధికారులను కోరారు. గురువారం సిపిఎం ఓల్డ్ సిటీ, న్యూ సిటీ కార్యదర్శిలు ఎం.రాజశేఖర్, టి.రాముడు, నాయకులు సిహెచ్.సాయి బాబా, కె.రామకృష్ణ, కె.ప్రభాకర్, యస్.మాబులాల్, ఉశేన్‌వలి, శ్రీనివాసులు హంద్రీనది, వక్కెర వాగు వెంట పర్యటచారు. ఈ సందర్భంగా రాజశేఖర్, రాముడు మాట్లాడుతూ కర్నూల్ నగరంలో గత కొద్ది రోజులుగా దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను పీక్కుతింటున్నాయని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. నగరంలో హంద్రీ నది, కేసీ కెనాల్, తుంగభద్ర నదులు మురికి నీటితో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని తెలపారు. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని చెప్పారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రజలపై భారాలు మోపడంలో చూపిన శ్రద్ధ ప్రజల ఆరోగ్యాల పట్ల పెట్టట్లేదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, వైసిపి ప్రజా ప్రతినిధులకు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం చేసుకోవాలన్నారు. కర్నూలు నగరంలోని మురికి కాలువలు శుభ్రం చేసి హైపో ద్రావణాన్ని వదిలి, బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమలను అంతమొందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 29వ తేదీ ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పత్తికొండలో రూ. 3 కోట్లు విలువైన భూ స్కామ్

- రాజారెడ్డి కాలనీ బాధితులకు అండగా ఉంటాం : కాంగ్రెస్

ప్రజాశక్తి - పత్తికొండ..

పత్తికొండలో రూ. 3 కోట్ల విలువ చేసే భూమిని పత్తికొండ ఎమ్మెల్యే, వైసిపి నాయకుడు స్కామ్ చేశారని డిసిసి అధ్యక్షుడు బాబురావు, పత్తికొండ నియోజకవర్గ ఇన్చార్జ్ క్రాంతి నాయుడు అన్నారు. గురువారం పత్తికొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షుడు బాబురావు, మాజీ మంత్రి మారెప్ప, కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి కాలనీని సందర్శించారు. అనంతరం పత్రికా విలేకరులతో వారు మాట్లాడుతూ పత్తికొండలో కాంగ్రెస్ పార్టీ హయాంలో 2008లో అప్పటి ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు చేతులమీదుగా 300 మంది నిరుపేద ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. ఇప్పుడు వైసీపీ నాయకులు స్వాహా చేశారని మండిపడ్డారు. రాజారెడ్డి కాలనీ బాధితులకు ఇల్లు పట్టాలు పంపిణీ చేసేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటామని హామీ ఇచ్చారు. ఈ నెల 29న కర్నూలుకు విచ్చేస్తున్న ఏపీసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండ్లూరి లాజరస్, ఓబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా సెక్రెటరీ అబ్దుల్, ఉపాధ్యక్షులు డాక్టర్ విక్రమ్ నాయుడు, ఏవి నాయుడు, కార్యదర్శులు హుస్సేన్, రహీమ్, నాగార్జున, షబ్బీర్, ప్రశాంత్, రహిమాన్, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు బాబురావు



బయటే కూర్చున్న అంగన్‌వాడీ టీచర్, పిల్లలు, మహిళలు

కేంద్రం తాళం ఇవ్వమంటే బెదిరింపులు

- మదనంతపురం అంగన్వాడీ టీచర్

ప్రజాశక్తి - మద్దికెర : అంగన్వాడి భవనం తాళం ఇవ్వమంటే సచివాలయం ఉద్యోగి బెదిరింపులకు పాల్పడుతున్నాడని మదనంతపురం అంగన్వాడి టీచర్ ధనలక్ష్మి వాపోయారు. సమ్మె అనంతరం సిడిపిఒ కార్యాలయంలో విధుల్లో చేరుతున్నట్లు ధనలక్ష్మి పత్రాలు అందించారు. విధుల్లోకి చేరాలని అంగన్వాడి కేంద్రానికి వెళ్తే తాళాలు వేయడంతో సచివాలయం ఉద్యోగిని సంప్రదించారు. తాళాలు తమ వద్దకు వచ్చి తీసుకువెళ్లాలని చెప్పారు. అయితే అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగిని అంగన్వాడి సెంటర్ దగ్గరికి వచ్చి స్టాక్ రిజిస్టర్ వివరాలను తెలియజేసి వెళ్లాలని కోరారు. సచివాలయం ఉద్యోగిని అందుకు నిరాకరించడంతో సమస్య తీవ్రంగా మారింది. సచివాలయం ఉద్యోగి తాళం ఇవ్వకపోవడంతో రెండు రోజులుగా అంగన్వాడి టీచర్, పిల్లలు బయటనే కూర్చొని వెళ్ళిపోతున్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా సిడిపిఒ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మైపర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రవి కుమార్ రెడ్డి తెలిపారు. కర్నూల్ నగరంలోని ఏ.క్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ ఓటర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు మైపర్ ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఓటు ప్రాధాన్యతను, మొదటిసారి ఓటు హక్కు వినియోగించు కుంటున్న వారు తప్పకుండా వారి ఓటును వేసి విజ్ఞతను చాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మైపర్ ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ - ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ప్రజాశక్తి - ఆదోని

ఓటు హక్కును ప్రతి పౌరుడూ బాధ్యతగా వినియోగించుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదోని మున్సిపల్ హైస్కూల్‌లో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ హైస్కూల్ నుంచి టూ టౌన్ పోలీసు స్టేషన్ మీదుగా ర్యాలీగా వెళ్లి భీమాస్ ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆదోని తహశీల్దార్ వెంకట లక్ష్మి, ఎంపిడిఒ గీతావాణి, డిఎల్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప, ఎంఇఒ శివ రాముడు హాజరయ్యారు. ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రధాన కూడలిలో తహశీల్దార్ వెంకట లక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సభలో సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఒక చిన్న వస్తువును కొనడానికి వాలాసార్లు వాటి గురించి తెలుసుకుంటామని, మన భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తును, తద్వారా దేశ భవిష్యత్తును నిర్మించుకోవాలంటే ఎవరైతే ముందు ఉండి నడిపిస్తారో అలాంటి ఉన్నతమైన వారిని ఎన్నుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ ఓటర్లు ఈరన్న, డి.గోపాల్‌రావును సబ్ కలెక్టర్ సన్మానం చేశారు. 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న యువతకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) వినియోగంపై అవగాహన కల్పించారు. **ఆలూరు**లోని విద్యార్థులతో జూనియర్ కళాశాల నుంచి ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గుండాల్ నాయక్, ఆర్ఐ బసవన్న గౌడ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని తహశీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల ర్యాలీని సిఇఒ ప్రారంభించారు. ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో విద్యార్థుల చేత ఉపాధ్యాయులు మానవహారం చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, ఎంఇఒ నీలకంఠ, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అబ్దుల్ సలీం, స్వర్ణ, మణి కుమారి, నసీరుల్లా బేగ్, విఆర్ఒలు రంగముని, కిషోర్ పాల్గొన్నారు. **చిప్పగిరి**లో మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఇఒ సావిత్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమా ఆధ్వర్యంలో తహశీల్దార్ చంద్రశేఖర్ నేతృత్వంలో సీనియర్ సిటిజన్ రామాచార్యులును, హిజ్రా బొగ్గుల మౌనికను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమా మాట్లాడారు. అంతకు ముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టి ఓటు హక్కు సామాజిక బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఎంఇఒ రాఘన్న, డిప్యూటీ తహశీల్దార్లు సరస్వతి, శశిశేఖర్, బిజెపి నియోజకవర్గ బాధ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి జయరాజు, సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.


ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


గోనెగండ్లలో...


చిప్పగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


మంత్రాలయంలో సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న అధికారులు


కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

28న సభను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 28న రాజమండ్రిలో జరిగే సభను ఉద్యోగ, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప కోరారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విరామ సమయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామన్న ప్రభుత్వం, ప్రస్తుతం నాలుగేళ్ల తర్వాత జిపిఎస్ అని మరో కొత్త పెన్షన్ విధానాన్ని ముందుకు తెచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన 50 శాతం పెన్షన్‌కు అదనంగా డిఎ కలిపి ఇస్తామని చెప్పి, ఎవరి అభిప్రాయాలతో నిమిత్తం లేకుండానే చట్టం కూడా చేసేసిందని చెప్పారు. ఈ చట్టం ప్రకారం సిపిఎస్‌ను కొనసాగిస్తున్నట్లే 50 శాతానికి తగ్గిన పెన్షన్ మొత్తాన్ని టాప్ అప్ రూపంలో చెల్లిస్తారని తెలిపారు. 'పేరులో గ్యారెంటెడ్ పెన్షన్ విధానమని పేర్కొన్న ఈ కొత్త విధానానికి గ్యారెంటీ ఎంతవరకు అనేది సందేహమేనని చెప్పారు. ఉద్యోగులు కోరుకునే విధంగా ప్రతి పిఆర్‌సిలో ఎంతో కొంత పెరుగుతుంటే పాటు డిఎ, గ్రాట్యుటీ, కమ్యూటేషన్ ఉండే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు పరమేష్, మద్దయ్య, నరసన్న, ఈరన్న, ధర్మన్న, సత్యన్న, రామకృష్ణ, సూర్యనారాయణ శెట్టి, కోటేశ్వర ఆచారి, కేశవయ్య, ఎం.ఉమా దేవి, లక్ష్మీ కళ, విజయలక్ష్మి, వాణి, పరిమల, హనుమంతరావు పాల్గొన్నారు.

28న పత్తికొండకు చంద్రబాబు

- టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న శేషాద్రి నాయుడు

ప్రజాశక్తి - ఆస్పరి

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 28న పత్తికొండకు రానున్నట్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, మండల మాజీ కన్వీనర్లు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం వారు స్థానిక గాంధీ పార్కులో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాభివృద్ధిని మరిచి అక్రమ కేసులు పెట్టి ప్రజలను వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు రాజ్‌కుమార్, మల్లేషప్ప, సీతన్న, నాగేంద్ర, రంగస్వామి, నాగన్న, రవి, మహానంది, రాఘవేంద్ర, కిష్టప్ప, చిన్న, ఓంకార్ పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్మోహన్ రెడ్డి

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీల ద్రోహి అని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, జిల్లా బీసీ సెల్ నాయకులు సత్రం రామకృష్ణుడు తెలిపారు. గురువారం కోసిగిలో టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న అధ్యక్షతన 'జయహో బీసీ' నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. టిడిపి హయాంలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. అలాగే ఈనెల 28న పత్తికొండకు 'రా కదలిరా' కార్యక్రమానికి టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్నారని తెలిపారు. జయప్రదం చేసేందుకు అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. టిడిపి నాయకులు మల్లికార్జున, ఏసేపు, అంజయ్య, వీరేష్ గౌడ్, నరసన్న పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం, గోనబావి గ్రామంలో ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఇవిఎంల వినియోగం పై అవగాహన కల్పించారు. గురువారం అవగాహన కేంద్రాన్ని ఎఇ, ఆర్ఒ వీర భద్రప్ప, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ ఎఒ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇవిఎం ద్వారా ఓటు ఎలా వేయాలని అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమం ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్నారు. ఇవిఎంలు ఎలా పని చేస్తాయనేది వివరిస్తారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోకవర్గ కేంద్రాల్లో ఇవిఎం అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సర్పంచి రాము, పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్, విఆర్ఒ రమేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజా వికాసం పరీక్షను సద్వినియోగం చేసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా వికాసం పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. గురువారం ఆదోనిలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 29న నిర్వహించే మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిస్తే మండల, పట్టణ, నగర స్థాయిలో 1, 2, 3వ బహుమతులను అందిస్తారన్నారు. మోడల్ పరీక్ష వల్ల విద్యార్థుల్లో ఉన్న పబ్లిక్ పరీక్షల భయం తొలగుతుందన్నారు. అదనపు సమాచారం కోసం 9052166745, 9515295609 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు గౌస్, శశిధర్, గణేష్, భరత్ కుమార్, రాజు, మహేష్ పాల్గొన్నారు.


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ప్రధానోపాధ్యాయులు

- ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోనిలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు గురువారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఉన్నతంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు గురురాజ, ప్రియాంక, అయ్యరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు ఎన్ఎంఎస్ విద్యార్థులు

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎ.చైత్ర, వి.వైష్ణవి, ఎం.ఉదయ్ కుమార్, కె.షేక్షావలీ, వి.చైతన్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.హలీం సిద్ధిఖి తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పేదరికాన్ని దూరం చేసే ఆయుధం విద్య అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కోటన్న, ప్రసాద్, శ్యామల, శకుంతల, అపర్ణ, రాధ పాల్గొన్నారు.

నిధుల నిలిపివేత

- ఆగిన నాడు - నేడు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - దేవనకొండ

నాడు-నేడు కింద జరిగిన పనులకు నిధులను నిలిపివేశారు. నిధులు నిలిచిపోవడంతో నాడు-నేడు కింద నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు - నేడు పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. మొదటి విడత కింద ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తాగునీటి, టాయిలెట్స్, అదనపు గదుల నిర్మాణాలు చేపట్టింది. రెండో విడత కింద అరకొర నిర్మాణ పనులు మాత్రమే జరిగాయి.

దేవనకొండ మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాల, గుండ్లకొండ, తెర్నేకల్లు, కరివేముల, కుంకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాలకు రెండో విడత కింద నాడు - నేడు పనులను పాఠశాలల పేరెంట్స్ కమిటీతో మొదలుపెట్టారు. ఆయా పాఠశాలల నిర్మాణాలకు రూ.లక్షలాది నిధులను ప్రభుత్వం కేటాయించింది. పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు కొంతమేరకు చేపట్టారు. నాలుగు నెలలుగా నిధులు నిలిచిపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఎన్నికల సమయం ఏప్రిల్‌లో ఉండడంతో ఆయా పాఠశాలల నిర్మాణాలు ఇప్పట్లో జరిగే పరిస్థితి లేదు. నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అసౌకర్యాల మధ్యనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత నాడు - నేడు నిధులను మంజూరు చేసి మధ్యలో నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణాలు ముందుకు సాగేలా చేయాలని ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కస్తూరిబా పాఠశాలలో మధ్యలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు

ఆదోనిలో 28న జాబ్ మేళా

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


పట్టణంలోని విమల రీజెన్సీ ఫైవ్ స్టార్ హోటల్‌లో నిరుద్యోగుల కోసం 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.40వేల వరకు జీతం ఉంటుందని చెప్పారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో రావాలని కోరారు. ఇతర వివరాలకు 9985496587, 9177413642 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

- వైసిపి యువజన మండల నాయకులు బందేనవాజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

నాలుగో విడత ఆసరా నగదును విడుదల చేసి ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారని వైసిపి యువజన మండల నాయకులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు టికె.బందేనవాజ్ తెలిపారు. గురువారం గోనెగండ్లలోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయం వద్ద వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాలు నిర్వహించారు. మండలంలోని 5,822 మంది డ్వాక్రా సంఘాల లబ్ధిదారులకు రూ.348.45 కోట్ల మెగా చెక్కును విడుదల చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పథకాలు చేపట్టి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఎంఎంఎస్ ఉపాధ్యక్షులు తిమ్మక్క, విఒఎలు, కాంట్రాక్టర్ ఈశ్వర్, కటికే మాబువలీ, మహ్మద్ పాల్గొన్నారు.




చెక్కు అందజేస్తున్న బందే నవాజ్

గ్రామాభివృద్ధిని మరిచిన సిఎం జగన్

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/నందవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామాభివృద్ధిని విస్మరించారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. గురువారం ఎమ్మిగనూరులోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి స్వగృహంలో కనకవీడు పేట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు వర బండే గురు స్వామి, నాగరాజు గౌడ్, ఖాసీం వలీ మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. టిడిపి హయాంలో చేపట్టిన వివిధ అబివృద్ధి పనులకు ఆకర్షితులమై, అధికార వైసిపి తుగ్లక్ నిర్ణయాల వల్ల విసిగిపోయామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయకుండా, సర్పంచి నిధులు, అధికారాలు కొట్టేసి సర్పంచులను హీనంగా చూస్తూ వైసిపి వ్యవహరిస్తున్న తీరుతో విసిగి చెంది టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. టిడిపిలో దాదాపు 200 మంది చేరారు. కె.పేట సర్పంచి సరస్వతి భర్త, వైసిపి నాయకులు ఉదయ్ కుమార్ గౌడ్, భీమన్న గౌడ్, శ్రీనివాస రెడ్డి, వెంకటేష్, లింగమూర్తి, శ్రీకాంత్ గౌడ్, బండెప్ప గౌడ్, నరసింహులు, మహాలింగప్ప గౌడ్, శేఖర్ రెడ్డి, ఉరుకుందు, రాంగోపాల్, నాగిరెడ్డి, నాగభూషణ్ రెడ్డి, రామలింగడు, రామన్న గౌడ్, వీరేష్ గౌడ్, లింగన్నలు టిడిపిలో చేరారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీవీ

ఎంపీ సీటు ఇవ్వాలి

- టిడిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు అప్సర్ బాష

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు ఎంపీ స్థానానికి టిడిపి తరఫున పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని టిడిపి మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు అప్సర్ బాష కోరారు. గురువారం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కళా వెంకట రావు ద్వారా టిడిపి అధిష్టానానికి ఫైల్ సమర్పించారు. గురువారం ఆయన ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో ముస్లిం, మైనారిటీలు అత్యధికంగా ఉన్నారని, తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే సునాయాసంగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అధ్యక్షులు అచ్చెన్నాయుడుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు, లోకేష్‌తో మాట్లాడతానని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని చెప్పారు. తొలుత మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్‌ను, మాజీ మంత్రి కళా వెంకట రావును అప్సర్ బాష తన బృందంతో కలిసి సన్మానించారు. టిడిపి నాయకులు బండి మహబూబ్ బాష, హనవాళ్ మహబూబ్ బాష, సాధుల్లా, ఇక్బాల్, జాకీర్ ఉన్నారు.


పార్టీ పెద్దలను కలిసిన అప్సర్ బాష

క్రమశిక్షణకు మారుపేరు 'దీక్ష'

- అతి తక్కువ ఫీజుతో ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్ లాంటి పరీక్షలకు శిక్షణ
- దీక్ష జూనియర్ కళాశాల సిఇఒ తిరుమల్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దీక్ష జూనియర్ కళాశాల క్రమశిక్షణకు మారుపేరని కళాశాల సిఇఒ తిరుమల్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఉప్పర కల్యాణ మండపంలో దీక్ష జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు తిరుమల్‌రెడ్డి అధ్యక్షతన ఫెస్ట్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య ముఖ్యమైందని తెలిపారు. చెడు అలవాట్లకు గురి కాకుండా విద్యార్థులు కష్టపడేతత్వం, క్రమశిక్షణ, వినయ, విధేయతలు అలవర్చుకోవాలని సూచించారు. చదువు పట్ల ఆసక్తి, ఉత్సాహం, శ్రద్ధ కనబరుస్తూ ముందుకెళ్లాలని తెలిపారు. దీక్ష జూనియర్ కళాశాలలో చదివే ప్రతి బాలికకూ పూర్తి రక్షణ కల్పిస్తూ వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వారి ఎదుగుదలకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి పేద విద్యార్థీ ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే లక్ష్యంతో తమ కళాశాలలో అతి తక్కువ ఫీజుతో ఇంటర్మీడియట్ సాధారణ విద్యతో పాటు ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్ లాంటి కోర్సులకు అనుభవం కలిగిన అధ్యాపకుల చేత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ ఫెస్ట్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యా బోధనకు కృషి చేస్తున్న అధ్యాపకులకు సిఇఒ చిరు సత్కారాలు అందించారు. అనంతరం విద్యార్థులు నాటికలు, మిమిక్రీ, వివిధ నృత్యాలు ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి, అకాడమిక్ డైరెక్టర్లు పవన్, శివ పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న తిరుమల్‌రెడ్డి


మాట్లాడుతున్న దీక్ష జూనియర్ కళాశాల సిఇఒ తిరుమల్ రెడ్డి

చిన్నకడబూరులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో గురువారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల ఇంట్లో తనిఖీలు చేశారు. ఇందులో గుడిదల రామాంజి, తాయన్న అనే వ్యక్తుల నుంచి 5 బాక్సుల కర్ణాటక మద్యం, 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'కురువలను మోసగిస్తున్న రెవెన్యూ అధికారులు'

ప్రజాశక్తి-ఆలూరు

ఏళ్ల నుంచి కురువ అని పిలవబడే మాదాసి, మాదారి కురువలను రెవెన్యూ అధికారులు మోసగిస్తున్నారని కురువలు విమర్శించారు. గురువారం మనేకుర్తి గ్రామ మాదాసి, మాదారి కురువలు పంచాయితీ కార్యదర్శి విజయ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసి కురువ నాగరాజు మాట్లాడారు. కురువ అని పిలువబడే వాడుక పదమని, మాదాసి, మాదారి కురువలో ఉన్నది అది ఎస్సీలో ఉందని తెలిపారు. రెవెన్యూ అధికారులు కురువగా కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే కురుబగా బీసీ సర్టిఫికెట్ ఇస్తున్నారని చెప్పారు. అధికారులు చేసిన తప్పులకు తాము నష్టపోతున్నామని తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న కులగణనలో మాదాసి, మాదారి కురువగా నమోదు చేయాలని కోరారు. లేకపోతే సర్వేను బహిష్కరిస్తామని హెచ్చరించారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది వచ్చి అమాయక ప్రజలను మభ్యపెట్టి తంబ్ వేయించుకుంటే కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. లింగయ్య, నారాయణ, అయ్యాలి, దేవేంద్ర పాల్గొన్నారు.

'పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు'

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో ఎంపికైన పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన కనీస వసతులు ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సాంబయ్య తెలిపారు. గురువారం గోనెగండ్ల మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నాడు- నేడు' కింద ఎంపికై పనులు జరుగుతున్న పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలను పరిశీలించామని తెలిపారు. గోనెగండ్లలోని 16 పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. అవసరమైన చోట అన్ని సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పిస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరెడ్డి, బస్టాండ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహమతుల్లా పాల్గొన్నారు.





ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్ జెసి జిల్లా ఎస్పీ తదితరులు

పుడమికి పసుపు రాసినట్టు..

- రబీలో అధికంగా ఆవాలు సాగు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం



ప్రజాశక్తి - నంద్యాల రూరల్

పుడమ తల్లికి పచ్చని పసుపు రాసినట్లు ఆవాలు పంట పచ్చని పూతపూసి నేలంతా పసుపు రాసినట్లు వాటి అందాలతో దారిన వెళ్లే వారిచూపులను ఆకర్శిస్తూ కనువిందు చేస్తుంది. అవాలు సాగుతో నంద్యాల అందాలు శీతాకాలంలో అరకులో పూసే వలిసె పూల అందాలను చూడడానికి దేశం నలు మూలల నుండి పర్యాటకులు వస్తుంటారు. సహజ సిద్ధమైన అందాలతో సందర్శకులను వలిసెపూలు తన అందాలతో పర్యాటకులను కట్టి పడేసినట్లు నంద్యాల మండలంలోని కేసి కేనాల్ ఆయ కట్టుకింద అలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. ప్రతి సారి రబీ సీజన్‌లో రైతులు వరి సాగు చేసే వారు ఈ సారి మాత్రం రబీ సీజన్లో కేసి కెనాల్‌కు నీళ్లు రావని తెలిసి కొత్తపల్లి, బిళ్ల లాపురం, పొన్నాపురం, చాబోలు, కానాల, గ్రామాలలోని రైతు లు వరికి బదులుగా ఆవాలు పంట సాగు చేశారు. ఆవాలు పంట పూత దశకు వచ్చి పూత పట్టి అరకులోని వలిసెపూల వలె నంద్యాల ప్రాంతము అందాలు చూడా తరమా అన్నట్లు నంద్యాల ప్రాంత గ్రామ ప్రజలకు కనువిందు చేస్తోంది.

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ..

ఆవాలు పంటను తెగళ్ళు చీడ పీడలు పెద్దగా ఆశించవు. పచ్చ పురుగు పంటను ఆశించే అవకాశం ఉన్నప్పటికీ తక్కువ రకం మందు ఒకసారి పిచికారి చేస్తే సరిపోతుంది. పంట పెరగడానికి సేంద్రియ ఎరువులు కూడా తక్కువ గానే ఉపయోగిస్తారు కాబట్టి పెట్టుబడి చాలా తక్కువగా ఉంటుంది. బాగా పండితే ఏకరానికి రెండు నుండి ఐదు కింటాల వరకు దిగుబడి వస్తుంది. ఒక కింటా ధర ఎనిమిది వేల నుండి పది వేల వరకు ఉండొచ్చు. రైతులకు ఎకరానికి పది నుండి పది హేను వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. నంద్యాల ప్రాంతంలోని రైతులు, వరి తరువాత రబీ సీజన్లో రెండో పంటకు కేనాల్‌కు నీళ్లు రాకపోతే రైతులు ఎక్కువగా ఇష్టపడే పంట ఆవాలు.

ఎక్కువ శ్రమ అవసరంలేదు.



ఖరీఫ్‌లో వరి పంటను వేసాను మంచి దిగుబడి వచ్చింది. ఈ సారి ఎన్నడూ లేని విధంగా వరికి మంచి ధర పలికింది. రబీలో రెం డవ పంటగా మళ్ళీ వరి వేయాలనుకున్నాము కాని నీళ్ల రావని తెలిసి ఆరు ఏక రాలు ఆవాలు పంట వేసాను. దీనికి పెద్దగా కష్ట పడాల్సిన అవసరం ఉండదు. ఈ పంటకు నీళ్లు కూడా అవరం లేదు. ఖరీఫ్‌లో వేసిన వరికి ఆఖరి తడిగా నీరు పెట్టిన తరువాత అదే వరి పైరులో ఆవాలు విత్తనాలు చళ్ళ తాము. తరువాత చేతి కొచ్చిన వరి పంటను కోసేస్తాము. ఈలోపు ఆవాలు మొలకెత్తు తాయి. పైరు పెరగడానికి ఎకరానికి ఒక యాభై కేజీల యూరియా మాత్రం వేస్తాము. ఈ పంటకు పురుగు మందులు పెద్దగా అవసరం ఉండదు. ఒకసారి తక్కువ రకం పురుగు మందు పిచికారి చేస్తాము కాబట్టి ఈ పంటను పండించడానికి పెద్దగా శ్రమ పడవలసిన అవసరం లేదు. ఆవాలకు మార్కె ట్‌లో మంచి డిమాండ్ ఉంది. కింటాకు రూ.8000 నుండి పది వేల వరకు ధర పలుకుతుంది కాబట్టి ఈ పంట రైతుకు మేలే.

- సి. పుల్లయ్య, కొత్తపల్లి గ్రామం, నంద్యాల.

పంట మార్పిడితో భూ సారం వృద్ధి

ఎప్పుడూ ఒకే రకమైన పంటలు వేస్తూ ఉంటే దిగుబడులు తగ్గుతూ ఉంటాయి. చాలా మంది రైతులు నేటికీ ఒకే రకమైన పంటలు పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. పొలములో భూసారం తగ్గి రోగాలను (తెగుళ్ల) వ్యాప్తి చెందే పురుగుల సంఖ్య పెరుగుతుంది. యేటేటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు పెరిగి దిగుబడులు రెట్టింపు అయ్యే వీలుంటుంది. భూమిలో పోషకాలు సమృద్ధిగా అందుతాయి. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆవాలు పంటను రైతులు తప్పనిసరిగా ఈ -క్రాప్ లో నమోదు చేసుకోవాలి.

- ప్రసాద రావు, నంద్యాల మండల వ్యవసాయ అధికారి.

ఓటు అత్యంత విలువైనది

- ఓటర్లందరూ వినియోగించుకోవాలి
- జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటు హక్కును చక్కగా సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఓ పుల్లయ్యలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వా మ్యంలో ఓటు అత్యంత విలువైనదని ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఈసారి ఎన్నికల్లో 84 శాతం ఓట్లు పోలయ్యే లక్ష్యాన్ని కలెక్టర్ నిర్దేశించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఓటింగ్ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం అన్ని పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వివరించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేశామ న్నారు. యువ ఓటర్లు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని మంచి నాయకున్ని ఎన్ను కోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా దరఖాస్తు చేసుకొని నమోదు కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఓటు అనేది భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. 2019 ఎన్నికల్లో జిల్లాలో 82% ఓటింగ్ జరిగితే నంద్యాల పట్టణంలో కేవలం 69 శాతం మాత్రమే ఓటింగ్ జరిగిందన్నారు. పట్టణ ప్రాంతంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పోలింగ్ రోజు సెలవు దినంగా భావించకుండా ధైర్యంగా, నిష్పక్ష పాతంగా ఓటు వేసేందుకు ఉత్సాహం చూపాల న్నారు. అనంతరం ఓటు హక్కును వినియోగిం చుకుంటున్న 101 సంవత్సరాల సీనియర్ సిటిజన్ సుబ్బన్నను జిల్లా కలెక్టర్ శాలువాతో సత్క రించి ఘనంగా సన్మానించారు. ఓటరుగా కొత్తగా నమోదైన యువ ఓటర్లకు, వికలాంగత్వ ఓటర్‌కు ఎపిక్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓ అనురాధ, నియోజక వర్గాల స్పెషల్ అధికారులు, కమిటీల నోడల్ అధికారులు, డిఈఓ సుధాకర్ రెడ్డి, కళాశాల, పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ఓటు ప్రాధాన్యత గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ పేర్కొన్నారు. గురువారం ప్యాపిలిలోని బాలుర ఉన్నత పాఠశాలలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిటి మారుతి, సర్వేయర్ మల్లికార్జున, వీఆర్వోలు సోమశేఖర్, నవీన్, రామానాయుడు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తపల్లి :** 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ పెద్దన్న తెలిపారు. కొత్తపల్లిలో జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వీఆర్వోలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మిగతా 6వ పేజీలో...**

ఆశ వర్కర్స్ సమస్యలపై 8న చలో విజయవాడ

విజయవంతం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల



మాట్లాడుతున్న సిఐ టి యు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తదితర డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 8న నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నంద్యాల జిల్లా కమిటీ సమావేశం నరసింహయ్య భవనంలో గురువారం అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసు రత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి రమణకుమారి మాట్లాడుతూ ఆశ వర్కర్స్ లో కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు గ్రూప్ ఇన్సూరెన్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వము అతి తక్కువ వేతనాలు ఇస్తూ ఆశా కార్యకర్తలపై పనిభారం మోపుతుందన్నారు. ఆశ కార్యకర్తలకు సంబంధం లేని పనులు ఆశలతో చేయిస్తూ మానసిక వేదనకు గురి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఏ ఒక్క ఆశ కార్యకర్తను తొలగించరాదని వారన్నారు. ఆశా కార్యకర్తల పైన రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు లేకుండా చూడాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల రూపాయలు వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసి ఇల్లు లేని ఆశా కార్యకర్తలకు ఇళ్ల స్థలం ఇచ్చి పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని అన్నారు. మరణించిన ఆశ కార్యకర్తల కుటుంబాల్లో గుర్తించి వారి కుటుంబంలోనే ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సెలవులు మెడికల్ లీవులు వేతనంతో కూడిన మేటర్నిటీ లీవ్‌లు తదితర ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 8వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లాలోని ఆశా కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే శిల్పా, ఎంపీ పోచా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు

నంద్యాల మండలం చాబోలు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలు పేర్కొన్నారు. గురువారం చాబోలు గ్రామంలో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ నిర్మాణ పనులను ఎమ్మెల్యే, ఎంపీలు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని చాబోలు గ్రామాన్ని ఎంపీ దత్తత తీసుకొని అభివృద్ధి చేపట్టారని అన్నారు. ఎంపీ నిధులతో రోడ్లు వేయించడం జరిగిందని, నేడు 30లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రూ.45 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందని, టెండర్లు ప్రక్రియ పూర్తి కాబడిందని, త్వరలో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. గ్రామంలో ఎంపీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుండి విడుదలైన నిధులతో 2కోట్ల రూపాయల మేర అభివృద్ధి చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని వారు ప్రజలను కోరారు. చాబోలు గ్రామ ప్రజల తరపున ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ,ఎంపీటీసీ చిన్నయ్య,సర్పంచ్ కడియం మౌనిక తిమోతి, నగనం దరెడ్డి, రాజగోపాల్ రెడ్డి,మదర్ సా, పాలమాబు, తిమోతి, బాల ఉషేని, వేణుగోపాల్ రెడ్డి,మధుగోపాల్ రెడ్డి,విశాల్ రెడ్డి, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

అవుకు పిఎస్‌కు 'విఆర్' గండం

ప్రజాశక్తి - అవుకు



అవుకు పోలీస్ స్టేషన్లో పనిచేసిన ఎస్సైలు వరుసగా విఆర్‌కు వెళుతుండడంతో పోలీస్ స్టేషన్‌కు విఆర్ గండం పట్టుకుందని ప్రజలు విమర్శి స్తున్నారు. 2020-21లో పనిచేసిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి విఆర్‌కు వెళ్లగా, 2021-22లో పనిచేసిన ఎస్సై జగదీశ్వర్ రెడ్డి విఆర్‌కు వెళ్లగా 2023లో పనిచేసిన ఎస్సై నరేంద్ర విఆర్‌కు వెళ్లగా మరలా ఇప్పుడు 2024లో పనిచేస్తున్న ఎస్సై మేకల విష్ణు నారాయణ యాదవ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టి కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే విఆర్‌కు వెళ్లడంతో అవుకు పోలీస్ స్టేషన్‌కు విఆర్ గండం పొంచి ఉందని చర్చించుకుంటున్నారు. ఎస్సై నరేంద్ర,ఎస్సై విష్ణు నారాయణ యాదవ్‌లు ఇద్దరు కూడా కేవలం మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలోనే పనిచేసే విఆర్‌కు వెళ్లడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో అవుకు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన ఎస్సైలు ప్రజల అభిమానాలు చురగొని పదవీకాలం ఉన్నంత వరకు పనిచేసి మండలంలో విధులు నిర్వహించి తదుపరి వేరే స్టేషన్లకు బదిలీపై వెళ్లడం జరిగేదని ప్రస్తుతము వరుసగా నలుగురు ఎస్సైలు విఆర్‌కు వెళ్లడంతో అవుకు మండల పోలీస్ స్టేషన్లో ఎందుకు ఇలా జరుగుతుందని ప్రజలు అనుకుంటున్నారు. ఏదిఏమైనా జిల్లా ఉన్నతాధికారులు ఎస్సైలను వీఆర్వో పంపించడం గనక ఏదైనా బలమైన కారణాలు ఉంటే తప్ప విఆర్‌కు వెళ్లటం జరగదని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుత ఎస్సై విఆర్‌కు వెళ్లడంతో ఖాళీగా ఉన్న అవుకు పోలీస్ స్టేషన్‌కు విధులు నిర్వహించేందుకు కొత్తగా బాధ్యతలు ఎవరు తీసుకుంటారన్న చర్చ బలంగా వినిపిస్తోంది.



వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన జలదుర్గం గ్రామస్తులు

వైసిపి నుండి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - డోన్

ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన 50 కుటుబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. డోన్ పట్టణంలోని టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో చివరకు చెత్తకు కూడా పన్ను కట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. టిడిపిలో చేరిన వారికి అండగా ఉంటామని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. వైసిపిలో నుండి టిడిపిలోకి అల్వారి ఎల్లయ్య, దాసరి నాగరాజు, శనిగల నాగేంద్ర, గోదా గోరంట్ల, చంద్రమోహన్,అల్వారి భాస్కర్, అల్వారి సురేష్, అల్వారి రాజు, శివయ్య, రామకష్ణ, నాగిరెడ్డి, రంగస్వామి, కుమారస్వామి, సుబ్బయ్య, ఈశ్వరయ్య, మద్ది, రాము, మద్దిలేటి స్వామి, రాజు, ఆది నారాయణ, జనార్దన్, చంద్రశేఖర్, హరికష్ణ, శివకేశవులు, మధు, రవి, కళ్యాణ్ , మధు, మహేష్, మహేంద్ర, ఆదినారాయణ, చిన్న మద్దిలేటి పరమేష్, హనుమంతు, రామచంద్ర తదితరులు చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవేంద్ర, రామ సుబ్బయ్య, ఆర్ఇ నాగరాజు, విష్ణు, రాజశేఖర్, సుదర్శన్, సలాం, గోవింద తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం - వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఎస్ఆర్బిసి కాల్వ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న మేకల దేవరాజు అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకొని అతని వద్ద 48 మద్యం క్వాటర్లను బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు నందివర్గం ఎస్సై తిరుపాల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వెంకటాపురం గ్రామ సమీపంలో ఎస్ఆర్బిసి కాలువ ఆంధ్రప్రదేశ్ చెందిన మద్యం బాటిల్లను అక్రమంగా అమ్ముతున్నా మేకల దేవరాజును అదుపులోనికి తీసుకొని అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.



అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

మరోసారి అవకాశం ఇవ్వండి

- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి



లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వచ్చే ఎన్నికల్లో మరోసారి శిల్పా కుటుంబానికి అవకాశం ఇచ్చి అసెంబ్లీకి పంపాలని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పొదుపు మహిళలను కోరారు. వైఎస్ఆర్ ఆసరా 4వ విడిత రుణాలు మాఫీ సంబరాలను నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో మెప్మా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల అర్బన్, రూరల్‌కు చెందిన అక్కా చెల్లెమ్మలకు రూ.22 కోట్లు రుణ మాఫీ చెక్కును గ్రూపులకు చెక్కు పంపిణీ చేశారు. అనంతరం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని, అలాగేశిల్పా సహకర్ ద్వారా స్కిల్ డెవలప్ మెంట్ కింద శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రుణాలను మహిళలు వారి కుటుంబాలు స్వయం సంమృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైసిపిని గెలిపించాలని కోరారు. ఎంఎల్‌సి ఇసాక్ బాషా మాట్లాడుతూ జగనన్న ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం అన్నారు. మార్కెట్ రాష్ట్ర చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేసిందన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ షేక్. మాబున్నిసా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. శిల్పా రవిని మరోసారి అసెంబ్లీకి పంపుదామని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, పొదుపు గ్రూపులో మహిళలు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తెలిపారు. నందికొట్కూరు పట్టణంలోని ఏబియం పాలెం నందు వెయస్ఆర్ ఆసరా 4వ విడత సంబరాలు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, కౌన్సిలర్ కాటెపోగు చిన్నరాజు, చెరుకు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 4వ విడత వైయస్ఆర్ ఆసరా ద్వారా రూ.4 కోట్ల 40 లక్షల 43 వేలు జమ చేసినట్లు చెప్పారు. మెప్మా టి.యమ్.సి శాంత కుమారి, సిఓ అర్చన, వినయ్, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు బొల్లెద్దుల రామక్రిష్ణ, కౌన్సిలర్ లాలు ప్రసాద్, వైఎస్సార్సీపి పట్టణ ప్రధాన కార్యదర్శి మార్కెట్ రాజు, జిల్లా ఎక్జిక్యూటివ్ సభ్యురాలు సులోచనమ్మ, వైసిపి నాయకులు పి.రమేష్, అర్పీలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేస్తున్న చైర్మన్ తదితరులు

ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి : వ్యకాసం


ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్



మాట్లాడుతున్న ఎం నాగేశ్వరావు

నేడు నంద్యాలలో జరిగే కార్మిక కర్షక ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు కోరారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ప్రజాసంఘాల కార్యకర్తలతో సమావేశం నాయకులు పి.పకీర్ సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం.నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా రైతులను, కార్మికులను, వ్యవసాయ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ, పారిశ్రామిక ,రవాణా, ఖనిజ సకల సంపదలను ఆదాని, అంబానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని చెప్పారు. సమస్యల పరిష్కార కోసం శుక్రవారం ఉదయం 10 గంటలకు నంద్యాల నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి జరిగే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నాగన్న, ఎస్.రామసుబ్బయ్య, మధు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



ఆర్డిఓ దాస్ కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్వో కార్యాలయం ముందు గురువారం ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి .నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.నాగేశ్వరావు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జిఈ శ్వరయ్య, అధ్యక్షులు బి నారాయణ, కోశాధికారి ఎ.రామలింగేశ్వర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా 60 సంవత్సరాల పాటు ప్రజలకు సేవలు అందించి రిటైర్డ్ అయిన తర్వాత వారికి ఇచ్చిన హక్కులను నేటి పాలకులు విస్మరించడం విచారకరమన్నారు. ఇచ్చిన హామీల కోసం వృద్ధులు ఆందోళన చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని అన్నారు. 11వ పిఆర్‌సిలో 01-01-2022 నుండి తగ్గించిన అడిషనల్ క్వాంటంను తిరిగి యధావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్లు 70 సంవత్సరాలు నిండిన వారికి 10 శాతం, 75 సంవత్సరాలు నిండిన వారికి 15 శాతం అమలు చేయాలని, అందులో మళ్లీ తగ్గించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయంబర్స్మెంట్ రూ.2 లక్షల నుండి 5 లక్షల పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ దాసుకి, తాసిల్దార్ రాజశేఖర్ బాబుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు రాముడు, పురుషోత్తం, ఖాజముద్దీన్, గఫార్, శేషయ్య, మాసుం సాహెబ్, నజీర్ అహ్మద్, సోమన్న, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పోలిశెట్టి,గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. చాగలమర్రి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. 11వ పిఆర్‌సి లో 2022 నుండి తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను గతంలో మాదిరిగా పునరు ద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను, 11వ పిఆర్‌సి ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన వైద్యశాలలలో వైద్యం అందించాలని,మెడికల్ రీఇంబర్స్ మెంట్ పరధిని రూ 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసారు. అనంతరం తహసీల్దారు సుభద్రమ్మకు తమ డిమాండ్ల వినతి పత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కోశాధికారి రంగయ్య,సభ్యులు అన్నా సత్యనారాయణ, జబ్బార్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పెన్షనర్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డివిజన్ అధ్యక్షులు పక్కి రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ రెడ్డిలు డిమాండ్ చేశారు . పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరిం చాలని పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కిషోర్ కుమార్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హెల్త్‌కార్డు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన వైద్యశాలలలో వైద్యం అందించాలని,మెడికల్ రీఇంబర్స్‌మెంట్ పరధిని రూ 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ల సంఘం ట్రెజరర్ చల్లా బాలస్వామి, నాయకులు రామసుబ్బయ్య, శాస్త్రి, సుధాకర్ రెడ్డి ,మహబూబ్ బాషా ,శంకరయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రి : తహసీల్దారు కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం



తహసిల్దార్‌కి వినతి పత్రం ఇస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com


జాతీయ పథకావిష్కరణ పనులను పరిశీలిస్తున్న డోన్ మున్సిపల్ చైర్మన్

డోన్ కొండపై 100 అడుగుల జాతీయ పథకావిష్కరణ : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ కొండపైన 100 అడుగుల జాతీయ పథకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం డోన్ పట్టణంలోని కొండపైన ఉన్న ఆంజనేయ స్వామి గుడి దగ్గర శుక్రవారం ఉదయం 8 గంటలకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో జిందాల్ కంపెనీ వారి సౌజన్యంతో 14 లక్షల రూపాయల తో 100 అడుగుల జాతీయ పథకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని,ఈ కార్యక్రమనికి పట్టణం లోని స్వాతంత్ర సమరయోధులు,పురప్రముఖులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని కోరారు.

జయహో బిసి సభను జయప్రదం చేయండి : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఈ నెల 31న అమలాపురం గ్రామంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగే జయహో బీసీ కార్యక్రమాని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. కమిటీ సభ్యులు గురువారం మండలంలోని కరివేన గ్రామంలో బిసి సంఘాల నాయకులు చాకలి రమణ, కురువ బాలు,శ్రీనివాసులు, వడ్డే బాలుడు, గొల్ల దరగయ్య, కురువ శ్రీను, మద్దిలేటి, బోయ తిమ్మన్న, వడ్డే రమణ, సాలె నాగరాజు, బోయ నరసింహ, బ్రహ్మయ్య ఆచారి, నాగభూషణాచారి తదితరులను కలిసి జయహో బిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవీంద్ర బాబు, నాగార్జున, శ్రీనివాసులు, వేణు గోపాల్, నరసయ్య, శ్రీకాంత్, మద్దిలేటి, శేషన్న లతో పాటు మండల అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, అబ్దుల్లాపురం బాషా తదితరులు పాల్గొన్నారు.


కరివేన గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఇకపై నంద్యాలలో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు

- వైద్య సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు రావడం హర్షణీయం అని వక్తలు పేర్కొన్నారు. నంద్యాల ఐఎంఎ ఆధ్వర్యంలో, ఉదయానంద ఆసుపత్రి సహకారంతో, నంద్యాలలో ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో "క్యాన్సర్ జబ్బులు – ఆధునిక చికిత్సా విధానాలు" అన్న అంశంపై వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఎ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ అధ్యక్షతన, ఉదయానంద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భార్గవరెడ్డి నిర్వహణలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో ఉదయానంద ఆసుపత్రి కొత్తగా అత్యాధునిక వసతులతో ఉదయానంద– కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఒక వరం లాంటిదన్నారు. డాక్టర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రిలో సమగ్ర క్యాన్సర్ చికిత్సలు అందించడానికి అవసరమైన శస్త్ర చికిత్స విభాగం,అత్యాధునిక పరికరాలతో రేడియో థెరపీ, కీమోతెరపి వసతులు ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ క్యాన్సర్ చికిత్సలు అందుబాటులోకి తెచ్చామన్నారు. సదస్సులో ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న క్యాన్సర్ శస్త్ర చికిత్సా నిపుణులు డాక్టర్ సాయి ప్రణీత్ రొమ్ము క్యాన్సర్‌కు ఆధునిక శస్త్ర చికిత్స విధానాలు అంశంపై, ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ ,రేడియేషన్ క్యాన్సర్ నిపుణురాలు డాక్టర్ సుష్మిత "క్యాన్సర్ చికిత్సలో వ్యాధి నిరోధక విధానాలు" అంశంపై, తల,మెడ శరీర భాగాలలో క్యాన్సర్ శస్త్ర చికిత్సా విధానాలు" అన్న అంశంపై క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నాగ సుదర్శన్ రెడ్డి మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బర్డ్స్ గుండె శస్త్ర చికిత్సల ఆసుపత్రి డైరెక్టర్,ప్రముఖ గుండె శస్త్ర చికిత్సా నిపుణులు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, నంద్యాల ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రావు,అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న క్యాన్సర్ శస్త్ర చికిత్సా నిపుణులు డాక్టర్ సాయి ప్రణీత్

టిడిపితోనే బిసిలకు న్యాయం

- ఫరూక్ ను గెలిపించుకుందాం

- 'జయహో బిసి'లో వక్తలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

టిడిపితోనే బిసిల అభివృద్ధి సాధ్యమని, ప్రజా వ్యతిరేకి జగన్ మోహన్ రెడ్డిని గద్దె దించి తెలుగుదేశం పార్టీని అధికారం తీసుకోరావల్సిన బాధ్యత ప్రతి బీసీల పైన ఉందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల నియోజకవర్గ స్థాయి జయహో బీసీ కార్యక్రమాన్ని నంద్యాలలోని ఖలీల్ టాకీస్ ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫరూక్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలంతా సంఘటితంగా తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈసారి నంద్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చారని ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ బీసీలపైన జరుగుతున్న అన్యాయాలను బిసి లకు వివరించాలనే జయహో బీసీ కార్యక్రమం నిర్వహిం చాలని ఆదేశించారని, బీసీలు జగన్ పాలనలో బలైపోయారన్నారు. టిడిపి యువనాయకుడు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ మాట్లాడుతూ శిల్పా కుటుంబ పాలనలో నంద్యాలలో అనేక మంది బీసీలు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏ వి ఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్,జిల్లెల్ల శ్రీరాములు,కౌన్సిలర్ దూదేకుల జైనబీ, పట్టణ అధ్యక్షులు ఖలీల్,వలసల రామకృష్ణ,రాముడు,వడ్డెర సంఘం నాయకులు తిరుపాల్ బాబు,మహిళా నాయకురాలు విజయ గౌరి యాదవ్,జనసేన పార్టీ నాయకులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల నియోజకవర్గం జయహో బీసీ కార్యక్రమం లో అభివాదం తెలుపుతున్న నాయకులు

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

టిడిపికి చెందిన నాయకులు లాయర్ నజీర్ అహమ్మద్, సమద్ అహ్మద్, అహమద్ ఉసేన్, అబ్దుల్ రహిమాన్,డాక్టర్ జహీర్, జబీర్, ఇర్ఫాన్, మహబూబ్ బాషా, అబ్దుల్ మాలీ, మౌలానా నూర్ మహ్మద్ కుటుంబం సభ్యులతో పాటు మునాఫ్ 50 కుటుంబాలు ఆ పార్టీని వీడి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సమక్షంలో గురువారం వైసిపిలో చేరారు. వీరికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ముస్లిములకు సముచిత స్థానం కల్పించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదేనని అన్నారు. మునిసిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టౌన్ ప్రసిడెంట్ షేక్ మన్సూర్ అహ్మద్, మైనారిటీ సెల్ రీజినల్ కో ఆరినేటర్ అబుబక్కర్, మాజీ కో ఆప్షన్ జబ్బార్, కో ఆప్షన్ గఫార్, కౌన్సిలర్ నాయబ్, రావూఫ్, చిన్నరాజు, చాంద్‌బాష, లాలూ, జిల్లా నాయకులు ఉస్మాన్ బేగ్,మార్కెట్ యార్డు డైరెక్టర్ గపూర్, సలీం, గఫూర్, లడ్డూ, సమీవుల్లా, జావిద్, రహంతుల్లా, ఆజామ్, జిల్లా మహిళా నాయకురాలు సులోచనమ్మ, షేక్ హాషీనా నాయకులు పాల్గొన్నారు.


కండువా కప్పి ఆహ్వానిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి


పల్లకిలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఇఒ దంపతులు తదితరులు

శ్రీశైలంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంకాలం మహామంగళహారతి అనంతరం ఆలయ మహాద్వారం నుండి గిరి ప్రదక్షిణ మొదలై గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నందిమండపం, గంగా గౌరి సదన్ మీదుగా బయలు వీరభద్ర స్వామి వరకు చేరుకొని అక్కడి నుండి అలంకారేశ్వర్ ఆలయం మీదుగా వలయ రహదారి పై నుండి సారంగధర మఠం, సాగి హేమరెడ్డి మల్లమ్మ మందిరం, మహిషాసుర మర్దిని, రుద్రాక్ష మఠం, విభూది మఠం, రుద్రవనంలోకి చేరుకొని అక్కడ రెండు నంది మండపాల వరకు చేరుకుని ముగించారు. గిరి ప్రదక్షిణలో స్వామి అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. అలాగే స్వామి అమ్మవార్లకు ఊయల సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో, దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. **శ్రీశైలంలో ఉచిత సామూహిక సేవలు :** శ్రీశైల దేవస్థానం ఉచిత సామూహిక సేవలో భాగంగా సామూహిక రుద్ర హోమం నిర్వహించింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఈ అవకాశం చంద్రావతి కళ్యాణమండలో కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం వేదసర్వోపాసకారి పెద్దిరాజు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. **అమ్మ వారికి లక్ష కుంకుమార్చనలు :** క్షేత్రంలోని భ్రమరాంబ దేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తులకు పరోక్షంగా గోత్రనామాలతో పూజలు నిర్వహించుకునేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. పరోక్షంగా ఈ సేవలో 86 మంది భక్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం ఎర్రగుడూరు గ్రామం సమీపంలో కుక్కల దాడిలో దుప్పి మతి చెందింది. గురువారం ఉదయం ఎర్ర గూడూరు గ్రామం దగ్గరలో అడవిలో నుండి దారితప్పి బయటకు వచ్చిన దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో దుప్పి మృతి చెందింది. విషయం తెలిసిన వెలుగోడు ఫారెస్ట్ రేంజర్ ఎంఎ ఖాన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు.

బాధితులకు శెట్టి విజయకుమార్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


ఆర్థిక సహాయం అందజేస్తున్న శెట్టి విజయ్ కుమార్

నంద్యాల రోడ్డులోనీ వీవర్స్ కాలనీలో దీబగుంట్ల ప్రతాప్‌కు చెందిన గడ్డివాము గత శనివారం ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యింది. విషయం తెలుసు కున్న శెట్టి విజయ్ కుమార్ వెంటనే స్పందించి గురువారం బాధితా కుటుం బాన్ని పరామర్శించారు. బాధితుడికి రూ.10 వేలు చెక్కును అందించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నవారికి సాయం అందించేందుకు మానవతా దృక్పథంతో ముందుకు రావాలన్నారు. ఆపదలో ఉన్న వారికి కుల మతాలకు అతీతంగా తన వంతు సహాయ సహ కారాలు అందిస్తానని చెప్పారు. నంద్యాల జిల్లాలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు నా సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలియ జేశారు. ఈ సందర్భంగా శెట్టి విజయకుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ కాప్స్ రాష్ట్ర సలహాదారుడు గూడూరు సంజీవరాయుడు, రాయల్ కాప్స్ ఏపీ, తెలంగాణ యువ పొలిటికల్ ప్రెసిడెంట్ అంగం శివ రాయల్, మైలారు శ్రీనివాసులు, బండి నరసయ్య, వీరయ్య, నీలి రామారావు, నవకాంత్ సాఫ్ట్వేర్, రాటాల నరసింహ, మునయ్య, సిద్ది నారాయణ, జిల్లా సుబ్బరాయుడు, న్యాయవాది యాగటీల రంగస్వామి, శ్రీపతి ప్రసాద్, వరద పవన్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో నేటి నుంచి 'వికసిత్ భారత్'

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నాలుగు గ్రామాల్లో నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి మధుసూదన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ భారత్ సంకల్ప యాత్ర ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 26న మధ్యాహ్నం ఆలమూరు, 27న ఉదయం చిత్రేనిపల్లి, మధ్యాహ్నం హరినగరం, 28న ఉదయం రుద్రవరం సచివాలయాల పరిధిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అధికారులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

మౌలాలి స్వామి దర్గాలో బిసి ఇందిరా

ప్రజాశక్తి -బనగానపల్లె


మౌలాలి స్వామి దర్గాలో ప్రత్యేక పాతేహాలు నిర్వహిస్తున్న బీసీ ఇందిరా

పట్టణంలోని మౌలాలి స్వామి కుండలో విలేదాత్ ఇమామ్ అలి స్వామి పుట్టినరోజు సందర్భంగా మౌలాలి స్వామి దర్గాలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు. గురువారం మౌలాలి స్వామి కొండ మౌలాలి స్వామి పుట్టినరోజు సందర్భంగా మౌలాలి స్వామి దర్గాలోబీసీ ఇందిరా పాతేహాలు సమర్పించారు. కార్యక్రమ ంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, నాయకులు అన్వర్ సాహెబ్, హమ్మద్‌హుస్సేన్ నాయకులు పాల్గొన్నారు.

నాగరాజు ఆకస్మిక మృతి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - బేతంచెర్ల


పి నాగరాజు (ఫైల్)

బేతంచెర్ల పట్టణం కోటపేట నివాసి సిపిఎం శాఖ కార్యదర్శి పి నాగరాజు (24) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శి వైవి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు నాగరాజు వాళ్ల కుటుంబ సభ్యులతో సహా చిరు వ్యాపారాలు చేస్తూ, సిపిఎంకి ఎనలేని కృషి చేశారన్నారు. తోటి వ్యాపారస్తులు విద్యను అందించే విధంగా, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పేవాడన్నారు. మృతుడు నాగరాజు పార్థీవదేహానికి పార్టీ నాయకులు సభ్యులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భార్య నరసమ్మ, తండ్రి సుబ్బరాయుడు, తల్లి, సహోదరులను పరామర్శించారు.


పి నాగరాజు మృతదేహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



ఆళ్లగడ్డ : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



పాములపాడులో..


కొత్తపల్లిలో..

ఓటు అత్యంత విలువైనది

5వ పేజీ తరువాయి.. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ పట్టణంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాల నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువను తెలియజేస్తూ ప్లకార్డు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సిటిజెన్ లు విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ డబ్బు కోసం ఓటును అమ్ముకోవద్దని సూచించారు. తహసిల్దార్ హరినాథరావు, ఎంపీడీవో మహబూబ్ ఖాన్ , కమిషనర్ రమేష్ బాబులు మాట్లాడారు. అనంతరం సీనియర్ ఓటర్లను ఆర్డిఓ సన్మానించారు. ఓటర్ కార్డులను యువతి యువకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి చంద్రశేఖరయ్య, అనంత కళాశాలల నిర్వహ కులు అనంత రామసుబ్బారెడ్డి, ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి, ఎంఈఓ శోభా వివేకవతి తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికి ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తాసిల్దార్ రత్న రాధిక అన్నారు. ఓటర్ దినోత్సవం సందర్భంగా పాములపాడులో వివేకానంద విద్యా విహార్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కెజి రహదారిపై మానవహారం నిర్వహించి ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబు, వివేకానంద విద్యా విహార్ ప్రిన్సిపల్ రాయపాటి దేవిక, విఆర్వోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** మండల కేంద్రం పగిడ్యాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి పగిడ్యాల బస్టాండ్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ భారతి, ఎంపిడిఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని శ్రీ వాసవి జూనియర్ కళాశాల విద్యార్థులు తహసీల్దారు సుభ ద్రమ్మ ఆధ్వర్యంలో కళాశాల నుండి పెద్దమకానం మీదుగా గాంధీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో డిటిలు విజయ్ కుమార్,శ్రీనివాసరెడ్డి,రెవెన్యూ సిబ్బంది,సచివాలయాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం నుండి కస్బా పాఠశాల వరకు బనగానపల్లె నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కస్బా పాఠశాలలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎస్.పి.ఎస్. కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేయించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, వీఆర్వోలు, గ్రామపంచాయతీ సిబ్బంది ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పాణ్యం :** యువ ఓటర్లు ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా తమ ఓటును న్యాయంగా సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో యువ ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల నందు 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కరెస్పాండెంట్ విఎన్ సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సూది రెడ్డి రమేష్ రెడ్డి, సరళ దేవి, ప్రిన్సిపల్ జాన్ ఎలీషా బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో :** నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తాజుద్దీన్ అధ్యక్షత వహించారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరిమిలాదేవి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఆర్ రఘుపతి రెడ్డి , అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో బిజెపి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు బీజేవైఎం నాయకులు గూడూరు శివప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి కొండే పోగు చిన్న సుంకన్న హాజరై మాట్లాడారు. జిల్లా కార్యదర్శి గూడూరు రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పగిడ్యాలలో..


చాగలమర్రి : మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు, ఎంపిలకు విలువ లేదు

- టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, చివరకు సర్పంచులకూ విలువ లేదని, ఆయనకు లిక్కర్ మైనింగ్, ప్రభుత్వ ల్యాండ్ల మీద ఉన్న ప్రేమ ప్రజాప్రతినిధులపై లేదని టిడిపి నందికొట్కూరు నియోజవర్గ ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి విమర్శించారు. గురువారం పగిడ్యాలలో జయహో బిసి సభ టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌరు వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడారు. జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. బిసిలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రూ. 70 వేల 700 కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. టిడిపి ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే వైసిపి ప్రభుత్వంలో 10 శాతం తగ్గించి 24 శాతం కల్పించారని చెప్పారు. రాజకీయాన్ని రాజకీయంగా మాట్లాడాలి తప్ప సంస్కారాన్ని కోల్పోయి సంస్కారహీనుడిలా మాట్లాడడం సరి కాదని, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఇది తెలుసుకోవాలని హితవు పలికారు. సంస్కారహీనులుగా మాట్లాడితే మీ తల్లిదండ్రులకు చెడ్డ పేరు వస్తుందన్నారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు ఉందని, తెలిసి తెలియకుండా మాట్లాడవద్దని సూచించారు. 'రెండు పదవుల్లో కొనసాగుతున్న నీవు నియోజకవర్గానికి ఏం చేశావు' అని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు సర్పంచుల ఖాతాలో కేంద్ర ప్రభుత్వం రాత్రి 12 గంటలకు నిధులు వేస్తే 12 గంటల ఒక్క నిమిషం తర్వాత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వాటిని కాజేస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల గ్రామాల్లో సర్పంచులకు విలువ లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేశారన్నారు. 54 కార్పొరేషన్లను, చైర్మన్లను ఏర్పాటు చేసినా ఎటువంటి అభివృద్ధి లేదని విమర్శించారు. నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించిన అనంతరం బీసీలకు పెద్దపీట వేశారన్నారు. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ నారా చంద్రబాబు నాయుడు బీసీల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. లక్ష్మాపురం, ప్రాతకోట , నెహ్రూ నగర్ గ్రామాల నుండి పలువురు గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. అనంతరం టిడిపి మద్దతుతో గెలుపొందిన ప్రాతకోట సర్పంచి పిట్టల శేషమ్మను, లక్ష్మాపురం టిడిపి ఎంపిటిసి గౌరమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహేష్ నాయుడు, జయ సూర్య, కాకరవాడ వెంకట స్వామి, వగిలి శ్రీను, నాగముని, హేమ సుందర్ రాజు, మురళి, లక్ష్మాపురం గ్రామ నాయకులు మద్దిలేటి గౌడ్, షమీన్, కుమ్మరి గోవిందు, జనసేన నాయకులు రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జయహో బీసీ సభలో మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

సుబ్బరాయుడు స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి హుండి ఆదాయం గురువారం లెక్కించారు. గత సంవత్సరం అక్టోబర్ 12 నుండి నేటి వరకు ఇరవై మూడు లక్షల డెబ్బై ఆరువేల ఏడు వందల నలభై ఒక రూపాయల హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ రామకృష్ణ తెలిపారు. అలాగే ఆరు గ్రాముల ఆరువందల మిల్లీ గ్రాముల బంగారం,రెండు కేజీల 837 గ్రాముల వెండినీ భక్తులు స్వామి వారికి కానుకల రూపంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి శశి కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామి, వీరయ్య స్వామి,ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు మిలటరీ సుబ్బారెడ్డి, బీరం శివ రామి రెడ్డి, కృష్ణా రెడ్డి, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపు దృశ్యం